

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## కళాదర్శకుడు వాలి

### (విజయచిత్ర 1971 డిసెంబర్ సంచిక నుంచి పునర్ముద్రితము)



"సువర్ణ సుందరి" "రాజూ పేద" "జయం మనదే" "భట్టి విక్రమార్క" "రాణీ రత్నప్రభ" "భీష్మ" "పరమానందయ్య శిష్యుల కథ" "రైతు బిడ్డ" "బంగారు తల్లి" మొదలైన పలు చిత్రాలకు వాలి కళా దర్శకుడిగా పని చేసిన విషయం చాలా మందికి తెలుసు గాని, ఆయన ఒకనాడు తెలుగు చిత్రంలో "హీరో" అన్న విశేషం కొద్దిమందికే తెలుసు. పి. పుల్లయ్య గారు తీసిన "చల్ మోహన రంగా" చిత్రంలో వాలి సుబ్బారావు అనే యువకుడు పుష్పవల్లి పక్కన నాయక పాత్ర ధరించాడు. అతనే తర్వాత "వాలి" గా మారి ప్రసిద్ధ కళా దర్శకుడైనాడు.

సుబ్బారావు గారి తండ్రిగారైన వీరాస్వామి నాయుడుగారు మంచి స్టేజి నటుడు. 1914 లో సుబ్బారావు పుట్టినప్పటికే తండ్రిగారికి రంగస్థల నటనలో అమితానుభవం వుండేది. ఇందులో విశేషం ఏమిటంటే,

హరిశ్చంద్ర పాత్ర ధారణకు అమితమైన ప్రజాదరణ పొందిన కీ ॥ శే ॥ డి. వి సుబ్బారావు గారు ఆ రోజుల్లో లోహితాస్యుడి గానూ, వీరాస్వామి నాయుడు గారు హరిశ్చంద్రుడిగానూ నటించేవారు!

వీరాస్వామి నాయుడు గారికి చిత్రకళలో కూడా అభిమానం ఉండేది. నాటకాల్లో వేషాలు వెయ్యడమే కాకుండా, నాటకరంగాలను తీర్చి దిద్దడంలో ఆయన కృషి చేశారు. నాటకాలకు కావలసిన తెరలమీద దర్బారులూ, అరణ్యాలూ మొదలైన పెయింటింగ్స్ వేసేవారు. తర్వాత తర్వాత వార్ధక్య కారణంగా నటంచడం మానివేసినా, కర్టెన్స్ మీద పెయింట్ చెయ్యడం మాత్రం మానలేదు.

తండ్రిగారు పెయింటింగ్స్ వేస్తూ వుంటే చిన్న సుబ్బారావు కుంచెలు అందించడమూ, రంగులు కలపడమూ చేస్తూ తాను కూడా ఆ విధంగా చిత్రకళాభ్యాసం చెయ్యసాగాడు. చదువు మీద ఉత్సాహం కంటే, చిత్రకళ మీ దే అతనికి ఉత్సాహం ఏర్పడింది. దానికి తోడు ఆర్థికమైన ఇబ్బందులు కూడా ఏర్పడడం వల్ల మొదట్లోనే చదువు మానివెయ్యవలసి వచ్చింది. ఐతే, బడికి వెళ్ళి చదువుకోక పోయినా, ఇంటి పట్టునే వుంటూ పుస్తకాలు, గ్రంథాలు చదవడం అలవాటు చేసుకున్నాడు. పెద్దలు, పండితుల సాంగత్యం వల్ల ఎన్నో గ్రంథాలు అతనికి వంట బట్టాయి. వారి ప్రోత్సాహం వల్ల నే వాలి, ఆ తర్వాత బందర్లోని ఆంధ్రజాతీయ కళాశాలలో విద్యార్థిగా చేరగలిగాడు.

ఈ సుబ్బారావు చదువు, ఉత్సాహం, ప్రవర్తన చూసి రెండో ఫారం స్టాండర్డు గల విద్యార్థిగా అతన్ని కళాశాల గుర్తించింది. ఆ కళాశాలలో డ్రాయింగ్, వీవింగ్, మోల్డింగ్, సంగీతం, హిందీ, కార్పెంటరీ, తెలుగు, ఇంగ్లీషు అలా అన్ని సబ్జెక్టులూ విడివిడిగా బోధించేవారు. అప్పుడు తెలుగు మాస్టరుగా వున్న కాటూరు వెంకటేశ్వర రావు గారికి సుబ్బారావు ఒక ప్రియ శిష్యుడైనాడు. సుబ్బారావు అన్ని సబ్జెక్టులలోనూ కృషి చేస్తూ, అన్నిటా మంచి మార్కులు తెచ్చుకోసాగాడు. ఐతే, “డ్రాయింగ్” మీద మాత్రం అతనికి ప్రత్యేకమైన అభిలాష వుండేది: 1932 లో డ్రాయింగ్ పరీక్షలో ఉత్తీర్ణు డైనాడు.

నాటకాల్లో వేషాలు వెయ్యడం కూడా సుబ్బారావుకు నెమ్మదిగా అలవాటయింది. హిందీ రాష్ట్ర భాష వరకూ చదువుకోడం వల్ల హిందీ నాటకాల్లో కూడా నటిస్తూ వుండేవాడు.

ఒక్కసారి అతను ఒక ప్రకటన చూశాడు —— టీచర్స్ ట్రైనింగ్ స్కూలుకు డ్రాయింగ్ మాస్టర్లు కావాలని అందులో కనిపించింది. ఎందుకైనా మంచిదని తనూ ఒక దరఖాస్తు వేశాడు. ఆ రోజుల్లో డ్రాయింగ్ పరీక్షలో ఉత్తీర్ణులయిన

డ్రాయింగ్ మాస్టర్లు లభించడం కరువుగా వుండేది. అందువల్ల ఉత్తీర్ణుడైన సుబ్బారావుకు, దరఖాస్తు అందడంతోటే ఉద్యోగం లభించింది. కొండపల్లి దగ్గర వున్న విద్యానగరంలో అతను ఆ ఉద్యోగంలో చేరాడు. అయితే, అక్కడ విశేషం ఏమిటంటే .. దాదాపు అతని శిష్యులందరూ అతని కంటే పెద్ద వాళ్ళే: వాళ్ళకు డ్రాయింగ్ "పాఠాలు చెప్పడం" అంటే, అతనికి చాలా ఇబ్బందిగా వుండేది.

ఆంధ్ర జాతీయ కళాశాలలోని చిత్ర కళా విభాగాన్ని ప్రఖ్యాత చిత్రకారుడు, నవలా రచయిత అయిన అడవి బాపిరాజుగారు చూస్తున్నారని విని, సుబ్బారావు తన "మాస్టరు గిరీ" కి రాజీనామా ఇచ్చేసి, బందరు వచ్చేశాడు. బాపిరాజు గారి దగ్గర ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు; ఎన్నో మెలకువలూ, విశేషాలూ నేర్చుకుంటూ పెద్దవాడైనాడు.

ముట్నూరు కృష్ణారావుగారు "కృష్ణా పత్రిక" ను నిర్వహిస్తున్న కాలంలో రోజూ సాయంకాలం దర్బారు' జరిగేది. ఆ దర్బారుకు ప్రముఖ రచయితలందరూ హాజరవుతూ, కవితా చర్చలు చేస్తూ వుండేవారు. అప్పుడే సుబ్బారావుకు మల్లాది రామకృష్ణశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాధ సత్యనారాయణ, ముద్దుకృష్ణ వంటి ప్రముఖ కవులతో పరిచయం ఏర్పడింది. సుబ్బారావు "కృష్ణా పత్రిక" ప్రత్యేక సంచికల్లో బొమ్మలు వేస్తూ వుండేవారు. ఆయనతోపాటు తోట వెంకటేశ్వరరావు కూడా ఆ పత్రికలో బొమ్మలు వేస్తూ వుండేవారు. నేటి ప్రముఖ కళా దర్శకులలో ఒకరైన తోట, ఆ తోట వెంక టేశ్వరరావే.

అడవి బాపిరాజుగారి సలహాతో "తాడంకి మంటాడ" అనే గ్రామంలో, వాలి మళ్ళీ ఉపాధ్యాయుడిగా చేరారు. నేటి ప్రముఖ దర్శకుడు తాతినేని ప్రకాశరావు అప్పుడు నాలుగోఫారం చదువుతూ వుండేవారు.

రాజమండ్రిలో ఆంధ్రా సినీటోన్ స్థాపించి, సి. పుల్లయ్యగారు చిత్ర నిర్మాణం చేస్తున్నారు. బాపిరాజుగారికీ, పుల్లయ్యగారికీ అంతకు ముందే స్నేహం వున్నది. ఇద్దరూ కలిసి కలకత్తాలో ఒకటి, రెండు చిత్రాలకు పని చేశారు కూడా! వాలికి ఎలాగో, సినిమాల్లోకి ప్రవేశించాలన్న సంకల్పం కలిగింది. దానికి బాపిరాజుగారు ఎలాగూ వున్నారు గదా అని, చేస్తున్న ఉద్యోగాన్ని అలాగే విడిచి పెట్టేసి, రాజమండ్రి చేరుకున్నారు. చెప్పకుండా, చెయ్యకుండా వచ్చినందుకూ, ఉద్యోగం విడిచి పెట్టేసినందుకూబాపిరాజుగారు వాలిని మందలించారు. ఐనా, ఉత్సాహం అక్కడ లేనప్పుడూ, ఇక్కడే వున్నప్పుడూ "సరేలే" అనుకున్నారు. వాలి అక్కడ వుంటూ, సినిమా నిర్మాణంలో వున్న ఆ విషయం, ఈ విషయం తెలుసుకుంటూ వుండేవారు. సరిగ్గా అదే సమయంలో సి. పుల్లయ్య గారు "చల్ మోహనరంగా" అన్న చిత్రం ఆరంభించబోతూ అందులో

నాయకపాత్రను ధరించడానికి కొత్తవారుంటే బాగుంటుందని, అన్వేషణ చేస్తున్నారు. “బిడ్డను ఇంట్లోనే పెట్టుకుని పూరంతా తిరిగినట్టు —— సుబ్బారావును ఇక్కడే పెట్టుకుని అన్వేషణ చేశామే” అనుకున్నారు. పుల్ల య్య గారు ఆ పాత్రను వాలికి ఇస్తూ వాలికి వున్న నాటకానుభవమూ, ఆ పాత్రకు తగ్గ శరీర సౌష్టవమూ చూసి, పుల్లయ్యగారు ఆ పాత్రకు వాలి పనికొస్తాడన్న నిర్ణయానికి వచ్చారు. ఆ విధంగా వాలి – “చల్ మోహనరంగా” లో “హీరో” పాత్ర ధరించారు. ఐతే వాలికి నటన మీద కంటె, చిత్రకళ మీదే ఉత్సాహం ఎక్కువ వుండడంవల్ల, కళా దర్శకత్వ శాఖలోనే కృషి చెయ్యసాగారు. ఆ తర్వాత బాపిరాజు గారి దగ్గరే “మీరాబాయి” చిత్రానికి సహాయకుడిగా పనిచేశారు.

వాలికి మొదట్నుంచీ దుస్తులు, అలంకరణల మీద ప్రత్యేకమైన శ్రద్ధ వుండేది. ఆ శ్రద్ధతో ఆయన వివిధ పాత్రలకూ ఎలాంటి దుస్తులు వుండాలి? ఎలాంటి ఆభరణాలు వుండాలి? అని ఆలోచిస్తూ ఆ శాఖలో ఎక్కువగా కృషి చేశారు. 1941 లో గూడవల్లి రామబ్రహ్మంగారు "పత్ని" చిత్రం ఆరంభిస్తూ (ఋష్యేంద్రమణి, కె. యస్. ప్రకాశరావు నాయికా నాయకులు) ఆ చిత్రానికి కళా దర్శకత్వం వహించే బాధ్యతను వాలికి అప్పగించారు. అదే ఆయన తొలి చిత్రం: ఆ చిత్రంలోని కాస్ట్యూమ్ లో మంచి నైపుణ్యం కనిపించిందన్న పేరు లభించింది. వాలికి.

ఆ చిత్రం తర్వాత జి. వరలక్ష్మి, కె. యస్. ప్రకాశరావులు నాయికా నాయకులుగా బొంబాయిలో ఒక చిత్రం నిర్మించాలని (1943 లో) కొందరు నిర్మాతలు ఆలోచించారు. వాలి దానికి ఆర్టు డైరక్టరు. ఆ పని మీద ఆయన బొంబాయి వెళ్ళి కొంతకాలం వున్నారు. ఐతే, ఆ చిత్ర నిర్మాణం సరిగా జరగలేదు. ఐనా, బొంబాయి కాపరం వాలికి కొంత మేలే చేసింది. అప్పుడు జయశ్రీ తో శాంతారామ్ “శకుంతల” చిత్రం తీస్తున్నారు. వాలి ఆ చిత్రానికి సంబంధించిన కాస్ట్యూమ్స్, సెట్స్, పని విధానం పరిశీలిస్తూ చాలా విషయాలు, కొత్త పోకడలూ గ్రహించగలిగారు.

తిరిగి మద్రాసు వచ్చి వాల్మీకి, గొల్ల భామ చిత్రాలకు కళాదర్శకుడిగా పనిచేశారు; పేరూ నంపాయించారు. పల్నాటి యుద్ధం, పల్లెటూరి పిల్ల, స్త్రీ సాహసం, అనార్కలి, దేవదాసు మొదలైన చిత్రాలకు శేఖర్ (కొన్నింటికి) ఘోడ్ గాంవ్కర్ లతో కలిసి పని చేశారు. తర్వాత చాలా చిత్రాలు స్వతంత్రంగానూ, కలిసి పని చేశారు. ఇటీవల విడుదలైన “శ్రీ కృష్ణ దేవరాయలు” చిత్రానికి, “షత్రంజ్” హిందీ చిత్రాలకీ వాలి కాస్ట్యూమ్ డైరక్టర్ గా పనిచేశారు. ప్రస్తుతం “సంపూర్ణ రామాయణం” వర్ణ చిత్రానికి కాస్ట్యూమ్ డైరక్టర్ గానూ, “అమ్మమాట” కుకళాదర్శకుడిగానూ పనిచేస్తున్నారు వాలి.

"సూక్ష్మంలో మోక్షం" తెచ్చే కళా దర్శకుడిగా వాలికి పరిశ్రమలో పేరున్నది. సెట్సు రూపొందించడంలోనూ, కాస్ట్యూమ్స్ తయారు చేయించడంలోనూ తక్కువ ఖర్చులో ఎక్కువ ఎఫెక్ట్ తీసుకొస్తారని ఆయన పనిచేసిన సంస్థల అధిపతులు చెబుతూ వుంటారు.

"ఐతే ప్రస్తుతంలో కొందరు నా పద్ధతిని మెచ్చుకో వడం లేదు. కాగితం మోల్డ్ తోనే చక్కని కిరీటాలు, కవచాలు మొదలైనవి చక్కగా, లోహంతో చేసినవా అనిపించేటట్టు చెయ్యవచ్చు. కాని, "లోహం వుంటేనే బావుంటుంది" అని కొందరు అదే కావాలంటూ వుంటారు. దాని వల్ల ఖర్చు పెరుగుతుంది. ఇవాళ, పరిశ్రమలో నటీ నటులదే పై చెయ్యి. మేము పాత్రకు తగ్గట్టుగా దుస్తులు తయారు చేస్తే కొందరు నటీ నటులు వాటిని ఒప్పుకోరు. "ఫలానాలా ఉండాలి" అని శాసిస్తారు, దాని వల్ల మేము అనుకున్న ఎఫెక్ట్ పాత్ర లో కనిపించదు. బీదతనంలో వుండాల్సిన స్త్రీ టెరిలిన్ చీరలు కట్టుకున్నదేం? అని ప్రేక్షకులు ప్రశ్నిస్తూ వుంటే మేమేం చెప్పగలం?

చిత్ర నిర్మాతకు మంచి అభిరుచి వుంటే, సెట్సు అవీ బాగా వుండడానికి, వాస్తవికంగా కనిపించడానికి ఆస్కారం వుంటుంది. ఆ రోజుల్లో అందరికీ ఆలోచించడానికి బాగా "టైమ్" వుండేది. ఇవాళ వ్యవధి లేదు: దేనికి ఆలోచన అక్కర్లేదు! అందువల్ల "నైపుణ్యం" అనేది కనిపించకుండా పోతున్నది.

పెద్ద పెద్ద సెట్లు వున్న చిత్రాలు చూసి, ప్రేక్షకులు కళా దర్శకత్వం బాగున్నదంటూ వుంటారు. కళాదర్శకత్వం అంటే అదే కాదు. పేదరికం గల చిత్రంలో వున్న సెట్సు కూడా కళాదర్శకుడు వేసేవే. వాతావరణం, కథ, పాత్రల స్థితిగతులు వాటిని బట్టి సెట్సు, దుస్తులు రూపొందుతాయి. అంతేగాని, పెద్ద సెట్సు, ఖరీదైన దుస్తులూ కనిపించినంతమాత్రాన కళాదర్శకత్వం అద్భుతంగా వున్నదని అనుకోరాదు. అతి పేదరికంలో బతికే పాత్ర యొక్క ఇల్లు, పరిసరాలు ఎంతో దీనంగా, సహజంగా కనిపించేట్టు చేస్తే అది కళా దర్శకత్వమే అనిపించుకుంటుంది. అదీ సవ్యంగా, సందర్భంగా కనిపింప చెయ్యడమేగా "ఉత్తమ కళాదర్శకత్వం" అంటే?" అని ప్రశ్నించారు వాలి.

★★★

COMMENTS